## పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వండి

- మాజీ శాసనసభ్యులు ఉన్నం హానుమంతరాయ చౌదరి



మాట్లాడుతున్న ఉన్నం హానుమంతరాయ చౌదరి

కళ్యాణదుర్గం, అక్టోబర్ 17 ప్రభాతవార్త

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని మాజీ శాసనసభ్యులు ఉన్నం హానుమంతరాయ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామ్మోహాం చౌదరిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నం మాట్లా డుతూ.. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు నష్టపోయి ఇబ్బం దులు పడుతున్నా రాష్ట్రప్రభుత్వానికి కానీ స్థానిక మంత్రికి కానీ ఇవేమీ పట్టించు కోవడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికే రైతులు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతూన్నరని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిద్రమత్తు వీడి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యదర్శి అమిలినేని లక్ష్మినారాయణ, మాజీ శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ ఆర్జీ శివశంకర్, మండల పార్టీ కన్వీనర్ డీకే రామాం జినేయులు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైపి రమేష్, మాజీ జడ్పిటిసి కొల్లా పురప్ప, మాజీ ఎంపిపి రాయల శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్‌గౌని శ్రీనివాసరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కునే సాయినాథ్, మాజీ సర్పంచు గోవిందరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి సత్తి, అక్కమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గొర్ల గోవిందరాజులు, మల్లిపల్లి నారాయణ, మోరేపల్లి రాము, ఉటంకి రామాంజినేయులు, జిపి నారాయణ, ఇటుకల రామాంజినేయులు, సునీల్ కుమార్, బసవరాజు, నారాయణస్వామి, గోళ్ల రాము, 13వ వార్డు రామాంజి నేయులు, మహేష్, రామకృష్ణ, అందేపల్లి ముత్యాలు, రజినీకాంత్, గంగిరెడ్డి, శివ, మహేష్, సన్నప్పయ్య, రామాంజినేయులు, ఓబులేష్ పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బెలుగుప్ప, అక్టోబర్ 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలో పెద్ద ఎత్తున వాల్మీకులు సోమవారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకులుమాట్లాడుతూ.. ఆనాటి వాల్మీకులు రామాయణం రచించిన వాల్మీకుడిగా, వాల్మీకులకు తెలియని వారికి తెలియజేశారు. వాల్మీకులు ర్యాలీ నిర్వహిస్తూ ఎరిస్వామి గుడి నుంచిమారెమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించి ఉత్సాహంతో కేరింతలతో ఘనంగా జయంతిని నిర్వహించారు. అందులో భాగంగా విజయవాడలో నిరాహార దీక్ష చేస్తున్న పెనుకొండ ఈశ్వరయ్యకు మద్దతుగా వాల్మీకులు ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసి తహశీల్దారు ఈశ్వరయ్య శెట్టికి వినతిపత్రం అందజేశారు. వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, పెద్దతిప్పయ్య, పురుషోత్తం, మారెన్న, పాతన్న, వెంకటేషులు, నగేష్, ప్రసాద్, భీమన్న, వెంకటేష్, బాలాజీ, వన్నూరుస్వామి, అధిక సంఖ్యలో వాల్మీకులు తదితరులు పాల్గొన్నారు.

## బలిజలకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు వర్తింప జేయాలి

బెలుగుప్ప, అక్టోబర్ 17 ప్రభాతవార్త



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బెలుగుప్ప మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయంలో సోమ వారం రోజు మండలంలో ఉండే బలిజలందరూ ఐక్యతతో తహశీల్దారుకు బలిజలను వైఎస్ఆర్ కళ్యాణమస్తుకు అర్హులను చేయాలని వినతిపత్రం అందజేశారు. బలిజల మండల అధ్యక్షులు ఎరిస్వామి మాట్లాడుతూ.. బలిజలను కాపు నేస్తం కింద నిధులను మంజూరు చేస్తున్నారని, బలిజలు కూడా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, అందుకోసం బలిజలను వైఎష్ఆర్ కళ్యాణమస్తును వర్తింప చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజినేయులు, ఎరిస్వామి, వరద స్వామి, చంద్రశేఖర్, శంకర్, గోవిందప్ప, అధిక సంఖ్యలో బాలిజలు పాల్గొన్నారు.

## లంబ్‌స్కిన్ వ్యాధికి టీకాలు

బెలుగుప్ప, అక్టోబర్ 17 ప్రభాతవార్త



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

బెలుగుప్ప మండల పరిధిలో నక్కలపల్లి గ్రామంలో డా.రమేష్ పశువులకు లంబ్‌స్కిన్ వ్యాధి టీకాలను గ్రామంలో ఉండే పశువులన్నింటికీ టీకాలు వేశారు. ఆ గ్రామ సర్పంచు యు.రామిరెడ్డి ఆధ్వర్యంలో పశువులకు కూడా రక్త పరీక్షలు నిర్వహించారు.

## వైఎస్ఆర్‌భీమా కింద 10వేలు మంజూరు

బెలుగుప్ప, అక్టోబర్ 17 ప్రభాతవార్త

బెలుగుప్ప మండల పరిధిలో యలగలవంక తాండా గ్రామానికి చెందిన గీతాబాయికి గ్రామ సచివాలయ వెల్ఫేర్ అధికారి శివశంకర్, సర్పంచు శోభాబాయి రూ.10వేలు వైఎస్ఆర్ భీమా కింద గీతాభాయికి అందజేశారు. ఈ సందర్భంగా శోభాబాయి మాట్లాడుతూ.. రవినాయక్ చనిపోయిన రెండు రోజులకే వైఎస్ఆర్ భీమా కింద రూ.10వేలు ఇవ్వడం ఎంతో ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబునాయక్, శంకర్ నాయక్, రమేష్‌నాయక్, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యపరిక్షలు చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం అక్టోబర్ 17 ప్రభాతవార్త



ఎరడికెరలో ప్రజావైద్యశిబిరం నిర్వహించిన డాక్టర్ రాజేష్‌కుమార్

మండలంలోని ఎరడికెర గ్రామంలో ప్రజావైద్య శిబిరంను డాక్టర్ రాజేష్‌కుమార్ అధ్వర్యంలో నిర్వ హించారు. ప్రజలకు అధికవర్షాలవల్ల ఎక్కడి కక్కడే నీరునిలిచి విషజ్వరాలు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి 42 మందికి వైద్యం అందించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలో పరిశుభ్రంగా వుంచుకోవాలని తెలిపారు. గ్రామాలలో మురుగునీరు నిలిచినచోట బ్లీచింగ్ వేయించి వీలైతే మురుగునీరు నిలవకుండా చూడాలని సూచించారు.

## చెత్తను డస్ట్‌బీన్‌లలో వేయండి

మునిసిపిల్ చైర్ పర్సన్ పొడరాళ్ల శిల్ప



డస్టుబీన్స్ పంపిణి చేస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్

రాయదుర్గం టౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

రాయదుర్గం పట్టణ ప్రజలు చెత్తను ఎక్కడి పడితే అక్కడ వేయకుండా డస్ట్ బీన్స్‌లో వేయి ఉంచితే మునిసిపాలిటీ వాహనాలు వచ్చి తీసుకెళ్తాయని ప్రజలకు మునిసిపల్ చైర్ పర్సన్ పోరాళ్ళ శిల్ప సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనర్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ సంకల్ప క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లాప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయదుర్గం పట్టణంలోని మునిసిపల్ చైర్ పర్సన్ పోరాళ్ళ శిల్ప వార్డు కౌన్సిలర్ గౌని లావణ్య సమక్షంతో 11 వార్డులో ప్రజలు వార్డులో వార్డు సెక్రటరీలు, వాలంటీర్ల ద్వారా డస్ట్ బీన్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ వార్డు కౌన్సిలర్లు శ్రీలక్ష్మీ, ఇంచార్జ్ పోరాళ్ళ శివ, శ్రీరామిరెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్ నాయక్, గోల్డ్ ఇస్మాయిల్, శ్రీనివాసులు, రమేష్, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి



బ్లడ్ గ్రూపు కార్యక్రమాన్ని ప్రారంభించిన విఫ్ కాపు

రాయదుర్గంటౌన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ నందు విద్యార్థులకు బ్లడ్ గ్రూపు నిర్ధారణ కోసం వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులగా హాజరై మాట్లాడారు. ఏవరైనా ప్రమాదాలు భారిన పడిన వ్యక్తులకు, గర్భవతులకు ప్రాణాపాయ స్థితిలో రక్తం కావాల్సిన పరిస్థితిలో గ్రూపు ఆధారంగా రక్తం ఇవ్వాల్సి వస్తోందని.. కావునా విద్యార్థులు తప్పని సరిగా బ్లడ్ గ్రూపు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావునా మీరందరూ జూనియర్ రెడ్ క్రాస్ బ్లడ్ గ్రూపులో చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. రెడ క్రాస్ ద్వారా ఇండియాలో చాలా రకాలైన సేవలు అందుతున్నాయన్నారు.

## ఈశ్వరయ్యకు మద్దతుగా మండల వాల్మీకి సోదరులు

బొమ్మనహాళ్, అక్టోబర్ 17 ప్రభాతవార్త



నిరాహార దీక్షలో పాల్గొన్న వాల్మీకి సోదరులు

మండల పరిధిలోని బొమ్మనహాళ్, కందెపల్లి, గోవిందవాడ, ఉద్దేహాళ్, కృష్ణాపురం, సింగేపల్లి, లింగదహాళ్, బండూర్, దర్గాహొన్నూర, కళ్లహొళ్ల, అరేసముద్రం, కల్లుదేవన హల్లి గ్రామాలకు చెందిన వాల్మీకి సోదరులు విజయవాడలో నిరాహార దీక్ష చేస్తున్న ఈశ్వరయ్యకు మద్దతుగా సోమవారం పాల్గొన్నారు. మండల వాల్మీకి సంఘం అధ్యక్షులు వన్నప్ప మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. సోమవారం పెనుకొండ ఈశ్వరయ్యకు మద్దతుగా మండల వాల్మీకి సోదరులు పాల్గొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపిపి కందెపల్లి రమేష్, జిల్లా స్టీరింగ్ కమిటీ మెంబర్ వన్నల్లి రామాంజినేయులు, రామకృష్ణ వారితోపాటు సర్పంచులు కృష్ణ, గాదిలింగ, మాజీ సర్పంచు దేవన్న, అరెసముద్రం రాము, చిలుగురికి వన్నూరుస్వామి, మాజీ ఎంపిటిసి శీనా, ఉద్దేహాళ్ వన్నూరుస్వామి, వారితోపాటు వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

## ఎస్టీలుగా పునరుద్దరించాలంటూ ధర్నా



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

వాల్మీకి బోయలను ఎస్టీలుగా పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్ట ణంలోని స్థానిక మండల తహ శీల్దార్ కార్యా లయం ముందు వాల్మీకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రేగటి నాగరాజు, మోపిడి గోవిందు, సుంకన్న, తిప్పన్న, రాజగోపాల్, ఆనంద్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిగావున్న వాల్మీకి బోయలు ఆర్థికంగా, విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో ప్రస్తుత సీయం జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించేదుకు మొదటి శాసన సభ సమావేశాల్లోనే తీర్మాణం చేస్తామని హామీ ఇచ్చారని అయితే మూడేళ్ల గడుస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఈనెల 2 నుండి విజయవాడలో పెనుకొండ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష కొనసాగుతోందని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ టి.గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మినారాయణ, సుధాకర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయనిధి కింద పలువురికి మంజూరు అయిన ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పంపిణీ చేశారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని తన నివాసగృహంలో సోమవారం ఆయన కొనకొండ్ల గ్రామానికి చెందిన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాపనపల్లి సుమ కుటుంబ సభ్యులకు మంజూరైన 3 లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కును మృతురాలి భర్త బాపనపల్లి వేమన్నకు అందించారు. ఇదే ప్రమాదంలో మరణించిన బాపనపల్లి రమణమ్మ కుటుంబానికి మంజూరైన 3 లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కును నాలుగు రోజుల క్రితం ఆమె కుటుంబానికి అందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమను ఆదుకున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహాన్‌రెడ్డికు అందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డలకు జీవితాం తం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

## గుత్తిలో ఘనంగా ఉరుసు



గంధోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని కోట ప్రాంతంలో వెలసిన సయ్యద్‌బాషఖాద్రిఅలైః 675వ ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున స్వామివారి గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన చాదర్‌ను ఖాజాబందేనవాజ్ దర్గా నుండి చర్చి మీదుగా కొండపై వున్న దర్గా వరకు ఊరేగించారు. గంధోత్సవాలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. మతసామరస్యానికి ప్రతీకగా జరగనున్న ఈ ఉరుసుకు పెద్దఎత్తున భక్తులు హాజరవుతారు.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

గుత్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త



మృతి చెందిన మహేష్ (ఫైల్‌ఫోటో)

గుత్తి మండలంలోని లచ్చానుపల్లి గ్రామానికి చెందిన మహేష్ (24) అనే యువకుడు సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గడ్డి కోసం వైటిచెరువు గ్రామ సమీపంలోని పొలంలోకి వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి నివాళులు అర్పించిన పిజెఆర్ ట్రస్ట్ చైర్మన్ జీవానందరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. అనంతరం మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## సంస్కృతిని మార్చిన ఘనత జగన్‌రెడ్డిదే

- కుట్రపురిత పనులు మానుకోవాలి: బి.కె పార్థసారథి

రొద్దం, అక్టోబర్ 17 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బి.కె.పార్థసారథి

నందమూరి తారకరామా రావు పేరుతో ఉన్న వైద్య విశ్వవిద్యాలయానికి పేరు మార్చుకునే సంస్కృతి ఎక్కడ నేర్చుకున్నావనీ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహాన్‌రెడ్డి కుట్ర పూరిత పనులు మానుకుని ప్రజలు మెచ్చే నాయకుడిగా మెలగాలని ఒక్క రోజు రీలే నిరాహారదీక్ష కార్యక్రమం లో శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బి.కె పార్థసారథి ప్రభుత్వ పాలన చేస్తున్న సియం జగన్‌పై విరుకుపడ్డారు. ఈ కార్యక్రమంలో సుబ్బరత్నమ్మ, రొద్దం నరసింహులు, చిన్న అప్పయ్య, నరసహరి, అశ్వర్థనారాయణ, లీలావతి, అంజినేయులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు మండల నాయకులు రీలే దీక్షను ఉద్దేశించి మాట్లాడారు. వైసీసీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి చేయకుండా కుట్రలు, కుతంత్రాలు, మోసాలకు ప్రాధాన్యత ఇస్తున్నారే తప్పా రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామన్న ఇంకిత జ్ఞానం కూడా లేదన్నారు. ఏవరైనా అభివృద్ధిపై ప్రశ్నిస్తే కేసులు, దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అభివృద్ధికి మారు పేరు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రూ. 13 వేల కోట్ల తో కియా కార్ల పరిశ్రమ వచ్చిందన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి గా ఉన్న ఎమ్మెల్యే శంకర్ నారాయణ ఎక్కడైనా ఒక్క గుంత పూడిపించావాననీ ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా పేర్లు మార్చే దోరణి మానుకోవాలని.. ప్రజల మనోభావాలను దెబ్బతీయకుండా పరిపాల సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం బి.కె పార్థసారథి, మండల ప్రధాన కార్యదర్శులు మురళీలు తేదేపా నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

## మరువ ప్రాంతంలో గుంతల పూడపు

- ఎంపిపి కి ప్రజలు కృతజ్ఞతలు

రొద్దం, అక్టోబర్ 17 ప్రభాతవార్త



మరువ పారుతున్న రొద్దం చిన్న చెరువు

రొద్దం మండల కేంద్రంలో రొద్దం చిన్న చెరువు మరువ పారుతోంది. పెద్ద వంక మోరిపై నీటి ప్రవాహానికి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో ప్రజలు, వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విషయాన్ని గమనించిన ఎంపిపి చంద్రశేఖర్ పజలు, వాహనదారులు వెళ్లడానికి వీలుగా ట్రాక్టర్లలో కంకరను ఏర్పాటు చేసి గుంతలను పూడ్పించారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు.

## హక్కుల సాధన కోసం తహాశీల్దార్‌కు వినతి

రొద్దం, అక్టోబర్ 17 ప్రభాతవార్త



తహాశీల్దార్‌కు వినతి అందిస్తున్న దృశ్యం

ఎస్టీ హక్కుల సాధన కోసం వాల్మీకులు రొద్దం మండల కేంద్రం నుంచి తహాశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో ప్రభుత్వం చేర్చాలని తహాశీల్దార్‌కు వినతి పత్రం అందేశారు. వాల్మీకులు అందరూ ఐక్యంగా ఉండాలని.. ఎన్ని ప్రభుత్వాలు, పార్టీలు వచ్చినా వాడుకుని వదలి వేశారని మండి పడ్డారు. ఏ పార్టీ అయితే వాల్మీలకు అండగా ఉండి. ఎస్సీ సాధన కోసం కృషి చేస్తారో వారికే పట్టం కట్టడుతామని పేర్నొన్నారు. ఈ కార్యక్రమంలో రొద్దం మండల వాల్మీకులు పాల్గొన్నారు.

## రోడ్లను పునరుద్దరించండి

గుత్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త

గత్తి మున్సిపల్ పరిధిలోని పలు ప్రధాన రహదారులు గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదురొ ్కంటున్నారు. ప్రధానంగా గాంధీచౌక్ నుండి కోటకు వెళ్లే రహదారి, సెంట్రల్ స్కూల్ నుండి పూలే సర్కిల్ వరకు వున్న ప్రధాన రహదారులు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. అదేవిధంగా అమృత థియేటర్ నుండి మెయిన్‌బజార్‌కు వెళ్లే రహదారి అధ్వాన్నానికి చేరుకుంది, ఆయా రహదారుల్లో ప్రయాణించేందుకు ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పులుచోట్ల వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లను పునరుద్దరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వైఎస్సార్ రైతు భరోసా పీయం కిసాన్ కింద 49,721 మంది రైతులకు రూ.19.89 కోట్ల లబ్ధి

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

వైఎస్సార్ రైతు భరోసా-పీయం కిసాన్ పథకం ద్వారా 2వ విడతగా ఉరవకొండ నియోజకవర్గంలో 49,721 మంది రైతులకు 19.89 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరింది. ఉరవకొండ మండలంలో 9,119 మంది రైతులకు 3.65 కోట్లు, వజ్రకరూరు మండలంలో 11,188 మందికి రైతులకు 4.48 కోట్లు, కూడేరు మండలంలో 9.563 మంది రైతులకు 3.83 కోట్లు, విడపనకల్లు మండలంలో 11,345 మంది రైతులకు 4.54 కోట్లు, బెలుగుప్ప మండలంలో 8,506 మంది రైతులకు 3.40 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరింది. ఒక్కొక్క రైతు బ్యాంకు ఖాతాలో 4,000 రూపాయల చొప్పున ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

## కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు అందించాలి

-జిల్లా 2వ మహాసభల్లో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హారిబాబు



జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి హారిబాబు

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హారిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక సీఐటీయు కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం (ఏపీకేఆర్ఎస్) జిల్లా 2వ మహాసభలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హారిబాబు మాట్లాడుతూ జిల్లాలో 56వేల మందికిపైగా కౌలు రైతులు భూములను కౌలుకు తీసుకొని వివిధ పంటలను సాగు చేస్తున్నారని అయితే ప్రకృతి వైపరిత్యాలు, వివిధ కారణాలతో పంటలు చేతికందక, అరకొరగా పంట చేతికొచ్చినా కౌలు డబ్బులు కూడా తిరిగిరాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు గత్యంతరంలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వేలాది ఎకరాల భూమి, ఆలయ భూములు ఉన్నాయని అయితే వాటిని సాగు చేస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే విషయంలో రెవిన్యూ, దేవాదాయశాఖ అనేక ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కౌలు రైతులు సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసి పంట నష్టపరిహారం అందించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి కౌలు రైతు కుటుంబానికి 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని, రైతులకు ఇచ్చే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఇతరత్రా సౌకార్యాలను కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పి.బాలరంగయ్య, యన్.మధుసూదన్, మండల కార్యదర్శి మురళి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు బి.జ్ఞానమూర్తి, విరుపాక్షి, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల నిరసన దీక్ష

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త



నిరసన దీక్ష చేస్తున్న దృశ్యం

దౌర్జన్యాలను నిరోధించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ పట్టణానికి చెందిన యం.రేణుక, యం.మధుబాబు దంపతులు సోమవారం పట్టణంలోని స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్ష నిర్వహిం చారు. ఉదయం వారు దీక్ష ప్రారం భించిన కొద్ది సేపటికే శిబిరంవద్దకు సిబ్బందితో వచ్చిన అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంటకస్వామి దీక్షకు అనుమతి లేదంటూ ఏదైనా ఉంటే మాట్లాడుదామంటూ వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దీక్షకు దిగిన దంపతులు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ సర్పంచ్ భర్త బసవరాజు తమకు సర్వహక్కులు కల్గిన 10వ వార్డులోని ఇంటికి గతనెల 25న దౌర్జన్యంగా తాళాలు వేశాడని ఆరోపించారు. ఇదివరకే రేణుక పేరుతో రిజిస్ట్రేషన్ అయిన ఇంటిని తన భార్య పేరు మీద దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకు కలిసి పిర్యాదు చేయగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్థానిక పోలీసులు ఇది సివిల్ కేసని ఒత్తిడులకు తలొగ్గి పట్టించుకోవడంలేదన్నారు. ఈ క్రమంలోనే న్యాయం కోసం దీక్షకు దిగాల్సి వచ్చిందని తగిన చర్యలు తీసుకుంటామన్న పోలీసుల హామీతో దీక్షను విరమించామని వివరించారు.

## బంకులను తొలగించండి

-గుంతకల్లు డీఎస్పీకు వినతిపత్రం అందించిన ప్రిన్సిపాల్, సిబ్బంది

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగ ణానికి అనుకొని ఏర్పాటు చేసిన వాణిజ్య బంకులను తొలగించాలని కోరుతూ గుంత కల్లు డీఎస్పీ యు.నరసింగప్పకు గుంతకల్లులో కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామ కృష్ణ సిబ్బంది సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాణిజ్య బంకులు ఉండటంవల్ల కళాశాల వాతా వరణం చెడిపోతుందని, కళాశాలలో చదువుతున్న బాలికలు వాణిజ్య సము దాయాలు దాటుకొని వచ్చేటప్పుడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నార న్నారు. కళాశాల ముందు వైపున అనంతపురం-బళ్లారి జాతీయ రహదారి ఉండటంవల్ల రోడ్డు దాటి వచ్చే సమయంలో బంకులవద్ద రద్దీ ఉండటంవల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని డీఎస్పీకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.నారాయణస్వామి, డా॥కె.హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు పరిహారం అందించండి

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త



దెబ్బతిన్న మగ్గాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

భారీ వర్షాలకు నష్ట పోయిన చేనేత కార్మికులకు మగ్గానికి 10వేల రూపాయల చొప్పున పరిహారం అందిం చడంతో పాటు ఎఫ్‌పీ షాపుల ద్వారా నెలరోజులకు సరిపడా నిత్యవసర సరు కులను అందించాలని సీపీఐ నియోజకరవ్గ సహాయ కార్యదర్శి వన్నూరుసాబ్, మండల కార్యదర్శి తలారి మల్లి తదితరులు డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు మగ్గం గుంతల్లో నీరు చేరి చెడిపోయిన మగ్గాలను సోమవారం వారు స్థానిక ఇందిరానగర్, 10వ వార్డు కాలనీలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగ్గం గుంతల్లో నీరు చేరడంతో సామాగ్రి మొత్తం చెడిపోయి ఉత్పత్తి ఆగిపోయి రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. చేనేత కార్మికులను ఆదేకోకపోతే బాధితులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజాక్ షేక్, సుంకరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## నిండు కుండలను తలపించిన ఉరవకొండ, బూదగవి చెరువులు..!

ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

భారీ వర్షాలు కురుస్తుండటంతో ఉరవకొండ ప్రాంతంలో చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. పట్టణంలోని చాబాల రోడ్డులోగల చిన్న చెరువుతోపాటు బూదగవి చెరువులో పూడిక పేరుకుపోవడంతో నీరు వృధాగా మరువ పారింది. చిన్న చెరువులోని నీరు పాతపేటను ముంచెత్తి నష్టాన్ని మిగిల్చగా బూదగవి చెరువు మరువ పారడంతో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో రాకపోకలకు కొంతసేపు ఇబ్బందులు ఏర్పడ్డాయి. బూదగవి చెరువు వివిధ పథకాల కింద కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పూడిక తీత పనులు చేపట్టినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.



మరువ పారుతున్న బూదగవి చెరువు

## టీడీపీ రాష్ట్ర ఉప్పర సాధికారిక సభ్యుడిగా గోపాల్..

**- మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథికి ఉప్పర కులస్తుల ఘన సన్మానం**



పెనుకొండ టిడిపి ఇన్‌చార్జ్ బికె.పార్థసారధిని సన్మానిస్తున్న ఉప్పర కులస్తులు

**సోమందేపల్లి, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

సోమందేపల్లి మండలానికి చెందిన ఉప్ప(సగర) కులస్తులు బోర్‌గోపాల్‌గా పేరు గాంచిన గోపాల కృష్ణను టీడీపీ రాష్ట్ర ఉప్పర సాధికారిక సభ్యుడిగా తెలుగు దేశం ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగింది. అందులో భాగంగా మండలానికి చెందిన ఉప్పర కులస్తులు పెద్ద ఎత్తున రొద్దం మండలం మరువపల్లి మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథిని వారి స్వగృహం వద్ద ఘనంగా సన్మానించారు. దుశ్శాలువాలు, పూలమాలలతో బికెను సత్కరిస్తూ జెజెలు పలికారు. ఈ సందర్భంగా బికె.పార్థసారథి మాట్లాడుతూ.. యువకుడు, విద్యా వంతుడు దశాబ్దాలుగా తెలుగు దేశం పార్టీ అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేసిన గోపాల్‌ను ఉప్పర కులస్తుల రాష్ట్ర సాధికారిక మెంబర్‌గా తమ పార్టీ గుర్తించి గౌరవించడం జరిగిందన్నారు. మూడేళ్లుగా సోమంఏదపల్లి మండల వైసీపీ నాయకుల వేదింపులకు పలు సందర్భాలలో గుర్రైన చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో తెలుగు దేశం పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న గోపాల్‌ను ఈ విధంగా టీడీపీ పార్టీ సన్మానించుకోవడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో రాబోయే 2024 ఎన్నికల్లో సోమందేపల్లిమండల వ్యాప్తంగా కాకుండా నియోజకవర్గ వ్యాప్తగా అధిక సంఖ్యలో ఉన్న ఉప్పర కులస్తుల ఓటు బ్యాంకును తెలుగు దేశం పార్టీకి అనుకూలంగా తీర్చి దిద్దాలని ఆ దిశలో ముందుకు వెళ్లాలని గోపాల్‌ను ఆశీర్వదిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనను ఎంపిక చేసిన, తనకు పట్టంకట్టిన బికెకు ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని, వైసీపీ బెదిరింపులను ఎదుర్కొంటామని తెలుగు దేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేంగా పనిచేస్తామని, వందలాది మంది కులస్తుల హర్ష ధ్వనాల మధ్య ప్రకటించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉప్పర కులస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయానికి కంచె వేసి నిరసన తెలిపిన టిడిపి కౌన్సిలర్



మున్సిపల్ కార్యాలయానికి ముళ్ళకంచె వేసి నిరసన వ్యక్తం చేస్తున్న ధృశ్యం

**పుట్టపర్తిటౌన్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డు కౌన్సిలర్ టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి కార్యాలయానికి ఎవరూ పోకుండా సోమవారం ముళ్ళకంపల కంచెవేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా, ఇందులో 6 మంది కౌన్సిలర్లు టిడిపి వారు ఉన్నామని, అయితే మున్సిపల్ అధికారులు టిడిపి కౌన్సిలర్ల వార్డులపై వివక్షతతో వీధి దీపాలు, రహదారులు ఇలా ఏ అభివృద్ధి పనులు చేయకుండా చిన్నచూపు చూస్తున్నారన్నారు. తన 20వ వార్డులో పెద్ద కమ్మవారిపల్లిలో 15 రోజులుగా నీటిసరఫరా నిలిచిపోయిందని, ఉన్న ఒక్కబోరు చెడిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అందుకే ఈ విధంగా నిరసన తెలుపుతున్నా మన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ వెంకటరామిరెడ్డి, సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డిలు అక్కడకు చేరుకొని 20వ వార్డు పెద్దకమ్మవారిపల్లి లో నెలకొన్న త్రాగునీటి సమస్యను 24 గంటల్లో పరిష్కరి స్తామని హామీ ఇవ్వడంతో టిడిపి కౌన్సిలర్ రత్నప్పచౌదరి నిరసన విరమించారు.

## ఎస్‌పి గ్రీవెన్స్‌లో 65 ఫిర్యాదులు

**పుట్టపర్తి, అక్టోబర్ 17, ప్రభాతవార్త**



బాధితులతో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్, ఎఎస్‌పి రామకృష్ణప్రసాద్

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎస్‌పి కార్యాలయం నందు సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో జరిగింది. జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ సింగ్, ఎఎస్‌పి రామకృష్ణ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుండి వివిధ సమస్యలపై 65 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి,ఎఎస్‌పిలు ప్రతి ఫిర్యాదు దారుని సమస్యను నేరుగా అడిగి తెలుసుకున్నారు. స్వయంగా బాధితులతో మాట్లాడి వారి బాధలను విన్నారు. రస్తా వివాదాలు, కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, భూ వివాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలు వివిధ రకాల అన్ని సమస్యలను బాధితులు ఎస్‌పి, ఎఎస్‌పిలకు మొరపెట్టుకున్నారు. ఆయా సమస్యల పట్ల ఎస్‌పి స్పం దిస్తూ ఆయా పోలీస్ స్టేషన్లలో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపలన్నారు. సైబర్ నేరగాళ్ళపట్ల, నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి కోరారు. ఈ కార్య క్రమంలో ఎస్‌బి సిఐ గణేష్, పి.సి.రాఘవేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన ఇల్లు



వర్షానికి కూలిన ఇల్లు

**అమరాపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త)**

మండల కేంద్రమైన అమరాపురం నందు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా రఫీక్, గౌసియాల ఇల్లు కూలిపోయినట్లు తహశీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి సమర్పించారు. ఉన్న ఒక 2గాని ఒక్క ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులు అయ్యామని.. ప్రభుత్వం దృష్టి సారించి ఆదుకోవాలని తక్షణం వీఆర్ఓ ద్వారా నివేదికలను అందజేయాలని తహశీల్దార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## కొత్తరేషన్‌కార్డు ఇచ్చిన ఆరు నెలలకే బియ్యం

**అగళి, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని కొత్తగా రేషన్‌కార్డు పొందిన వారికి వెంటనే బియ్యాన్ని పంపిణీ చేయడం లేదు. కారణం కొత్తరేషన్‌కార్డు పొందిన కార్డు దారులకు కార్డు తీసుకున్న ఆరు నెలల తర్వాతే బియ్యం పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం, జీవో వచ్చిందని తహశీల్దారు జీలాని తెలిపారు. రేషన్‌కార్డు వచ్చిన వెంటనే గతంలో మాదిరి బియ్యం ఇవ్వరు. కార్డు పొంది ఆరు నెలల తర్వాతే కార్డు దారులకు బియ్యం కేటాయిస్తారని, ఇది గమనించి మండలంలో నూతనంగా రేషన్‌కార్డులు తీసుకున్న వారు ఆరు నెలల తర్వాత పోతే రేషన్‌ను పంపిణీ చేస్తారని, అలా కాకుండా కార్డు తీసుకుని తర్వాతి నెలలోనే రేషన్ షాపుల వద్దకు వెళ్తే బియ్యం ఇవ్వరని తహశీల్దారు తెలిపారు. ఇది గమనించి మండలంలో నూతనంగా రేషన్‌కార్డు పొందిన వారు పొందిన సమయాన్ని అంచనా వేసుకుని ఆరు నెలల తర్వాతనే వెళ్తేనే బియ్యం ఇస్తారు.

## మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోండి



తహాశీల్దారుకు విన్నవిస్తున్న ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

**గోరంట్ల, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించకుండా నిర్వహిస్తున్నారని ఎన్నో సందర్భాలుగా మండల శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించినా స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకుని ప్రైవేట్, కార్పోరేట్ సంస్థలు ఆదివారం కూడా సెలవు ప్రకటించకుండా పాఠశాలలు నడుపుతున్నారని వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు శశి మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, సెలవు దినాలలో కూడా పాఠశాలలను నడుపుతున్నారని, విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఇవి పలు అనుమానాలకు తావిస్తోందని ఎన్నిసార్లు ఫోన్ చేసినా కూడా స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని లేకపోతే విద్యాశాఖకు గౌరవం లేకుండా పోతుందని, విద్యార్థులకు భవిష్యత్తు లేకుండా పోతుందని తెలిపారు. అదే విధంగా మండల విద్యాధికారి వారానికి ఒకటో రెండు సార్లు వచ్చి విధులు నిర్వహిస్తున్నారని,పై స్థాయి అధికారులు స్పందించి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శశి, భారత్, మంజు, రాఘవ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## తహాశీల్దారును సత్కరించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్

**గోరంట్ల, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



సన్మానిస్తున్న దృశ్యం

సోమవారం స్థానిక తహాశీల్దారు కార్యాలయంలో తహాశీల్దారు రంగనాయకులను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సభ్యులు ఎంఎన్ మూర్తి తహాశీల్దారును సన్మానిస్తూ గోరంట్ల మండలం బూడిదగడ్డపల్లి పొలంపైకి సర్వే నెంబర్ 740-3 ఐదు ఎకరాల 15 సెంట్ల భూమిని దళిల వర్గానికి చెందిన మాల ఓబులమ్మకు అగ్రవర్ణాలకు చెందిన దూదేకుల బాబన్న అక్రమంగా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 700/3 ఐదు ఎకరాల 15 సెంట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని మాల ఓబులమ్మకు చెందిన సర్వే నెంబర్ 740/3లో కంచె వేసి ఈ భూమి నాది అంటూ ఆక్రమించుకునేందుకు సిద్దంగా ఉన్నారని , గత పెనుకొండ సబ్ కలెక్టర్ ఇచ్చిన పత్రాలతో తహాశీల్దారుకు విన్నవించి భూమి సమస్యలను పరిష్కరించాలని, ఓబులమ్మకు యదా విధిగా 1బి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు.

## టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం



ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న టీడీపీ నాయకులు

**రామగిరి, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించుకుందామని మండల టీడీపీ నాయకులు రామగిరి పంచాయితీలో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న పట్టభద్రుల ఇంటి వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించడం ఇంకా నమోదు చేసుకునే వారి పేర్లను సేకరించారు. అంతేకాకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కూడా సాధారణ ఎన్నికలకు కూడా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, ఉపాధ్యక్షులు ఆంజినేయులు, రైతు సంఘం అధ్యక్షులు అక్కులప్ప, ఎంపిటిసి శ్రీనివాసులు, తెలుగు యువత అధ్యక్షులు శ్రీధర్‌నాయుడు, నాయకులు గుర్రం శీనా, నగేష్, జయచంద్ర, మనోహర్ రఘురాం పాల్గొన్నారు.

## భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని గెలిపించుకుందాం

**-పట్టభద్రుల ఓటరు నమోదుపై తెదేపా అవగాహన**



ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**బుక్కపట్నం రూరల్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

పట్టభద్రుల ఎన్నికల కొరకు బుక్కపట్నం మండల పరిధిలో టిడిపి నాయకులు శ్రీసత్యసాయి జిల్లా తెదేపా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటుహక్కు నమోదు కొరకు ఆన్‌లైన్ ప్రక్రియపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి పులివెందుల భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలపించాలని, ఇందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సామకోటి ఆదినారాయణ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుండే విద్యార్థి ఉద్యమ నాయకుడిగా వివిధ సమస్యల పట్ల రాజీలేని, అంకితభావంతో కూడిన పోరాటం, వ్యవసాయ, గ్రామీణ నేపథ్యం,గ్రామాలలో రైతుల కష్టాలను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే వ్యక్తిగా భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బాలు, బుక్కపట్నం తెలుగుదేశం పార్టీ రైతు సంఘ: కార్యదర్శి సామకోటి ఈశ్వరయ్య, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగం వెంకటరాముడు, రామకృష్ణ, వీరనారాయణ ఆచారి, ఆంజనేయులు, వీరాంజనేయస్వామి, నరేష్‌కుమార్, గొర్లకిష్ట, మైనారిటీ నాయకులు షామీర్ బాషా, బేకరీ నాయుడు, సుధాకర్, తదితర తెదేపా నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బళ్లారి జీన్స్‌ఫ్యాంట్ల తయారీ కేంద్రాలను సందర్శించిన రాహుల్‌గాంధీ

**- మహిళా కార్మికులతో కలిసి జీన్స్ దుస్తుల తయారీ విధానం, సమస్యలు తెలుసుకున్న రాహుల్**



బళ్లారిలోని జీన్స్‌ఫ్యాంట్ల కుట్టుకేంద్రంలో పనిచేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

**బళ్లారి, అక్టోబర్17, ప్రభాతవార్త**

'భారత్‌జోడో పాదయాత్ర'లో భాగంగా బళ్లారికి వచ్చిన రాహుల్‌గాంధీ రెండు రోజులపాటు పాదయాత్రకు బ్రేక్‌నిచ్చారు. తాలూకాలోని సంగనకల్ వద్ద రెస్ట్ క్యాంపులో బస చేసిన ఆయన సోమవారంనాడు తిరిగి బళ్లారి నగరానికి ఆకస్మిక సందర్శన చేశారు. నగరంలోని 30వ వార్డు కౌల్‌బజార్ ప్రాంతంలో ఉన్న జీన్స్‌ఫ్యాంట్ల తయారీ కేంద్రాలను సందర్శించారు. జీన్స్ దుస్తులు కుడుతున్న మహిళలు, పురుష కార్మికుల దగ్గరికి వెళ్లిన రాహుల్‌గాంధీ వారిని నవ్వుతూ పలకరించి జీన్స్ దుస్తుల తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంలో వారి సమస్యలను ఆరా తీశారు. జీన్స్‌ఫ్యాంట్ల తయారీలో దేశంలో 'బళ్లారి జీన్స్'కు మంచిపేరు ఉంది. ఈ నేపథ్యంలో బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర తన క్షేత్రం పరిధిలోకి వచ్చే కౌల్‌బజార్‌లోని జీన్స్ తయారీ కేంద్రాల్లోకి రాహుల్‌గాంధీని తీసుకెళ్లారు. జీన్స్ పరిశ్రమను నమ్ముకొని బతుకుతున్న వేలాది మంది కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ తమ వృత్తిని కొనసాగిస్తున్నారని, నేటికీ వారికి కార్మికశాఖ నుంచి, ప్రభుత్వం నుంచి ఎటువంటి సదుపాయాలు లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. దేశ ప్రముఖుల్లో ఒకరైన ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ హఠాత్తుగా తమ కళ్లెదుట ప్రత్యక్షమై అభిమానంతో ఆప్యాయంగా పలకరించడంతో ఉబ్బితబ్బిబ్బి అయిన మహిళలు, యువకులు రాహుల్‌గాంధీతో కరచాలనం చేసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. రాహుల్ కూడా వారితో కలిసిపోయి ఫోటోలు తీసుకునేందుకు సహకారం అందించారు. రాహుల్ భేటీతో జీన్స్ కార్మికులైన జావిద్, వినోద్ ఇతర మహిళా కార్మికులు తమ సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ ఆసీఫ్ స్వతహా తన కుటుంబ సభ్యులతో కలిసి జీన్స్ ఫ్యాంట్ల తయారీ కేంద్రాన్ని నడుపుతుండడాన్ని రాహుల్ చూసి అభినందించారు. వారి కుటుంబ సభ్యులతో మమేకమై కాసేపు ముచ్చటించారు. రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర జీన్స్ ఫ్యాంట్ల తయారీ యజమానులతో భేటీ చేయించి దేశంలో జీన్స్ దుస్తుల తయారీకి అవసరమైన ముడిసరుకు ధర విపరీతంగా పెరిగిపోవడంతో ఉత్పాదన తగ్గిపోయిందని, కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ, ఇతర పన్నుల కారణంగా తాము అతి కష్టంగా జీన్స్ దుస్తుల్ని తయారు చేయాల్సి వస్తున్నదని, ఇంతకముందు వందలాది మంది కార్మికులకు ఉపాధినిస్తూ తాము జీన్స్ తయారీ కేంద్రాలను నడిపామని, కోవిడ్ తర్వాత జీన్స్ పరిశ్రమ మొత్తం కుదేలయ్యిందని వారు రాహుల్‌గాంధీతో వాపోయారు. అనంతరం వారికి మంచిరోజులు వస్తాయని ఓదార్చిన రాహుల్‌గాంధీ తిరుగుప్రయాణమయ్యారు.

## మూడుచక్రాల వాహనాల కొరకు దరఖాస్తు చేసుకోండి

**పుట్టపర్తిరూరల్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం మేనేజింగ్ డైరెక్టర్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయో వృద్ధుల సహాయ సంస్థ విజయవాడ నుండి విడుదలైన జి.వో.ఎం.ఎస్. నెంబర్ 10 మహిళా, శిశు, విశభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రకారం శ్రీసత్యసాయి జిల్లాలో నియోజకవర్గానికి 10 చొప్పున మోటారు మూడు చక్రముల వాహనాలను మంజూరు చేయడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో **https://www.apdascac.ap.gov.in/** వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ జిల్లా సహాయ సంచాలకులు/జిల్లా మేనేజర్ అబ్దుల్ రషీద్ ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థి వయస్సు 18-45 సంవత్సరాల మధ్యలో ఉండాలని, సదరం సర్టిఫికెట్ నందు కాళ్ళ వైకల్యం 70%పైగా ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్/లెర్నర్‌లైసెన్స్ కలిగి ఉండాలని, వారికి సొంత వాహనం కలిగి ఉండరాదని అలాంటి వారు అర్హులన్నారు. గతంలో దరఖాస్తు చేసుకొని ఉండి రాని వారు కూడా నూతనంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. చదువుతున్న వారికి రెగ్యులర్ గ్రాడ్యుయేషన్‌ఆ పై చదువుతున్నట్లు అయితే బోనఫైడ్ పత్రములు ఉండాలని లేదా 10వ తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధి పథకము, లేదా వేతనం పొందుతూ కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు. మహిళలుఅయితే 50 శాతం, షెడ్యూల్ కులం వారు అయితే 16 శాతం, షెడ్యూల్ తెగల వారికి 7 శాతం చొప్పున వాహనాల మంజూరులో రిజర్వేషన్ కల్పించబడిందన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉండాలని, పై అభ్యర్థులు లేని యెడల జిల్లా ఎంపిక కమిటీ వారికి తగు చర్యల కొరకు అధికారం ఉంటుందన్నారు. కావున అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత హార్డ్ కాపీలను సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్ ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయో వృద్ధుల సహాయ సంస్థ, బుడ్డప్పనగర్, అనంతపురం నందు సమర్పించాలని ఆయన కోరారు. మరింత సమచారం కొరకు 9866782326 లేదా 08554 232380 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## వైభవంగా అమరాపురం చెరువులో గంగపూజ



దేవాలయంలో విశేష పూజలు



దేవతామూర్తు ఊరేగింపు దృశ్యం

**అమరాపురం, అక్టోబర్ 17 (ప్రభాతవార్త)**

మండల కేంద్రంలోని అమరాపురం చెరువు 41 సంవత్సరాల తరువాత మరువ పారడంతో అమరాపురం గ్రా మ పెద్దలు, ఉలికుంట, వీరాపురం, మద్దనకుంట, బంగారుపాళ్యం తదితర గ్రామాలకు చెందిన ప్రజల సమక్షంలో పెద్ద ఎత్తున గంగాపూజ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందవర్భంగా గ్రా మదేవత చోళమాంబ దేవిని గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువ వద్ద ఈశ్వర దేవాలయం నందు ప్రతిష్టాపన చేసి విశేష పూజలు నిర్వహించారు. చెరువు మరువ వద్ద గ్రామ పెద్దలు పురోహితుల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి మహిళలువిచ్చేసి పూజలు చేశారు.

## లోకాయుక్త భూకుంభకోణం కేసులో నిందితుడైన.... మంత్రి శ్రీరాములు రాజీనామాకు ఉగ్రప్ప డిమాండ్




మాట్లాడుతున్న మాజీ ఎంపీ వి.ఎస్.ఉగ్రప్ప, మాజీ మంత్రి ఎం.దివాకర్‌బాబు

**బళ్లారి, అక్టోబర్17, ప్రభాతవార్త**

అక్రమ భూకుంభకోణంలో లోకాయుక్త ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా ఉన్న జిల్లా మంత్రి బి.శ్రీరాములు చట్టం పట్ల గౌరవం ఉంటే తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి బొమ్మై మంత్రి స్థానం నుంచి శ్రీరాములను తొలగించాలని, ఈ రెండు జరగని పక్షంలో తాను రాష్ట్ర గవర్నర్‌ను కలిసి శ్రీరాముల్ని తొలగించాలని డిమాండ్ చేస్తామని మాజీ ఎంపీ ఉగ్రప్ప తెలిపారు. బళ్లారిలో సోమవారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన, బళ్లారి నగరశివారులో సుమారు రూ.300 కోట్ల విలువైన భూమిని అక్రమంగా నకిలీ దాఖలాలు సృష్టించి 27 ఎకరాల భూమిని కొనుగోలు సంబంధించి ఇప్పటికే లోకాయుక్త పోలీసులు బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు 6 వేల పేజీల చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారని పేర్కొన్నారు. బీవీఎల్ నారాయణరావు అనే వ్యక్తికి చెందిన సుమారు 27 ఎకరాల భూమిని నకిలీ దాఖలాలు సృష్టించి తన పేరుతో పాటు వివిధ బినామీ పేర్లతో రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. లోకాయుక్త దోషారోపణ చార్జ్‌షీట్‌లో ఆరో నిందితుడిగా మంత్రి శ్రీరాములు పేరు ఉన్నదని, కావునా మంత్రి స్థానంలో శ్రీరాములు కొనసాగేందుకు ఏ నైతిక హక్కులేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. సదరు స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను సైతం ఆ సమయంలో అక్రమంగా కూల్చివేశారని తెలిపిన ఉగ్రప్ప, ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేసేందుకు ముందుకురాలేదని, చేసేదేమిలేక వ్యక్తిగతంగానే బాధితులు కోర్టును ఆశ్రయించారని, సదరు కేసు తనిఖీ జరిగి మంత్రి శ్రీరాములుపై 120బీ, 406, 409, 420, 447, 465, 468, 471 భూచట్టం సెక్షన్ 73, 192(ఏ), 1964 రెవెన్యూశాఖ చట్టం పరిధిలో కాలమ్‌ల కింద కేసు నమోదై దర్యాప్తు జరిగి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు, ప్రస్తుతం మంత్రి శ్రీరాములు బెయిల్‌పై ఉన్నారని ఉగ్రప్ప వివరించారు. బళ్లారి లోకాయుక్త పోలీసులు మొత్తం 11 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు, వీరిలో 1వ నిందితుడిగా అప్పటి జిల్లా కలెక్టర్ బి.శివప్ప, ఏ2 నిందితుగా ఆర్.వెంకటేష్, ఏ3 నిందితుడు అప్పటి తహసీల్దార్ శశిధర్‌బగలి, ఏ4 రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాటి ఆర్ఐ నిరేష్‌బాబు, ఏ6 నిందితుడు బి.శ్రీరాములు అని ఉగ్రప్ప చెబుతూ, ఇదొక అతిపెద్ద భూకుంభకోణం కేసు అని, సుమారు రూ.300 కోట్ల భారీ అవినీతి వ్యవహారమని ఆరోపించారు. ఇదే సందర్భంలో మాజీ మంత్రి ఎం.దివాకర్‌బాబు, బి.ఎం.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారిలో ఓటు వేసిన రాహుల్‌గాంధీ

**బళ్లారి, అక్టోబర్17, ప్రభాతవార్త**




ఓటుహక్కును వినియోగించుకుంటున్న రాహుల్‌గాంధీ

అఖిలభారత కాంగ్రెస్‌సమితి(ఏఐసీసీ) అధ్యక్ష ఎన్నికలు సోమవారంనాడు జరగగా 'భారత్ జోడో పాదయాత్ర'లో బళ్లారిలో సమీపంలోని సంగనకల్‌లో బస చేసిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. రాహుల్‌తో పాటు పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఓటుహక్కు ఉన్న సుమారు 40 మంది కూడా ఇదే సందర్భంలో ఓటు వేయడం కనిపించింది. తాత్కాలిక విశ్రాంతి క్యాంపులో ఏర్పాటు చేసిన బూత్‌లో రాహుల్‌గాంధీ ఉత్సాహంగా తన ఓటు వేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకాగానే కాంగ్రెస్‌కు చెందిన పదాధికారులతో సహజంగానే క్యూలో నిలబడి తనవంతు వచ్చిన తర్వాత బూతు లోపలికి వెళ్లి రాహుల్ ఎన్నికల సిబ్బంది నుంచి బ్యాలెట్ పత్రాన్ని తీసుకొని ఓటు వేసి బ్యాలెట్ బాక్సులోకి వేశారు. ఇదే సందర్భంలో బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల్లో ఒకరైన, కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ సోదరు డైన ఎంపీ డి.కె.సురేష్ కూడా తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. దేశ వ్యాప్తంగా ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో అనేక మంది పోలింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కు వినియోగించుకోవడం తనకు ఎంతో గర్విచందగ్గ విషయమని, ఇది ప్రజాతంత్ర లక్ష్యమని రాహుల్‌గాంధీ తన ఫేస్‌బుక్ పేజీలో అభిప్రాయం వ్యక్తం చేశారు.

## టీపఆర్‌ఎల్‌పై శిక్షణా తరగతులు



శిక్షణ ఇస్తున్న దృశ్యం

**అమరాపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం నందు టీఏఆర్‌ఎల్‌పై ఉపాధ్యాయులకు నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈవో సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. మూడు, నాలుగు ఐదు తరగతులను బోధించే ఉపాధ్యాయులకు వెనుకబడిన విద్యార్థులకు సవరణాత్మక బోధన కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, శివరాజ్, సీఆర్‌పీలు కాంతరాజు, సుశీలమ్మ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## పీఏబీఆర్ నుండి 13,560 క్యూసెక్కుల అవుట్ ఫ్లో

**ఉరవకొండ, అక్టోబర్ 17 ప్రభాతవార్త**



నీటిని పరిశీలిస్తున్న డ్యాం ఏఈఈలు బి.లక్ష్మిదేవి, హెచ్.గంగమ్మ, కె.ఫాతిమ

పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నుండి సోమవారం దిగువకు 7 స్పిల్‌వే గేట్ల ద్వారా 13,560 క్యూసెక్కుల నీరు వెళుతోందని డ్యాం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సి.గుర్రయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బి.లక్ష్మిదేవి, హెచ్.గంగమ్మ, కె.ఫాతీమ తెలిపారు. ఎగువనున్న పేరూరు డ్యాం, హంద్రీనీవా, లింక్ ఛానల్ ద్వారా 13,000 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌కు చేరుతోందన్నారు. డ్యాం నుండి మొత్తం అవుట్ ఫ్లో 15,900 క్యూసెక్కులు కాగా స్పిల్‌వే గేట్ల ద్వారా 13,560 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం 1600 క్యూసెక్కులు, తాగునీటికి 55 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 400 క్యూసెక్కులు, ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా 270 క్యూసెక్కుల నీరు వెళుతోందని వివరించారు.

